# గౌడన్నల పోరాటం.. తలొగ్గిన ప్రభుత్వం

**నీరా కేఫ్‌పై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు**

- నీరా కేఫ్, ఆస్తులు కూడా గీత కార్మికులకే
- గౌడన్నల పోరుతో దిగివచ్చిన ప్రభుత్వం
- కల్లుగీత ఫెడరేషన్‌కు బదిలీ చేస్తూ ఒప్పందం

నీరాకేఫ్‌ను పర్యాటక శాఖ నుంచి కల్లుగీత ఫెడరేషన్‌కు మారుస్తూ ఒప్పందం చేసుకుంటున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): గౌడన్నల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్‌ను కల్లుగీత కార్మికులకే అప్పగిస్తూ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. నీరాకేఫ్ అన్యాక్రాంతాన్ని 'నమస్తే తెలంగాణ' పత్రిక వెలుగులోకి తీసుకువచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతృత్వంలో కల్లుగీత కార్మికులు, గౌడ సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు తెలియజేశారు. నీరాకేఫ్ వద్ద ఎక్సైజ్, టూరిజంశాఖ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ సంఘాలు ఉద్యమం చేశాయి. అన్ని జిల్లాల్లో కల్లుగీత కార్మికులు, గౌడ సంఘాల నేతలు పలురూపాల్లో నిరసనలు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 17న హైదరాబాద్‌లో మహాధర్నా, అసెంబ్లీ ముట్టడికి 63 గౌడ సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో తలొగ్గిన ప్రభుత్వం నీరాకేఫ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించబోమని, త్వరలోనే కల్లుగీత కార్పొరేషన్‌కు ఇస్తామంటూ సర్క్యులర్ విడుదల చేసింది. అయినా ప్రభుత్వం నుంచి జీవో, అధికారిక ప్రకటన వస్తేనే ఆందోళనలు విరమిస్తామని గౌడ సంఘాలు, కల్లుగీత కార్మికులు ప్రకటించడంతో ఉద్యమ కార్యాచరణ మరింత ఉధృతరూపం దాల్చేలా రూపొందించడంతో ప్రభుత్వం దిగొచ్చింది. ప్రభుత్వం దిగిరావడంతో గౌడ సంఘాల నాయకులు పల్లె రవికుమార్ గౌడ్, అంబాల నారాయణగౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, సాయన్నగౌడ్, శివకుమార్‌గౌడ్, ఏడుకొండలు గౌడ్, చీకటి ప్రభాకర్‌గౌడ్, సదానంద్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్, నక్కా కృష్ణగౌడ్, ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, రమణగౌడ్, బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్, జైహింద్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, పటేల్ వెంకటేశ్‌గౌడ్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

**కల్లుగీత ఫెడరేషన్‌కు నీరాకేఫ్ బదిలీ: పొన్నం**

పర్యాటకశాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్‌ను బీసీ సంక్షేమశాఖలోని కల్లు గీత ఫెడరేషన్‌కు బదిలీ చేసినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నీరాకేఫ్ భవనం, దాని పరిధిలో ఉన్న ఆస్తులను కల్లుగీత ఫెడరేషన్‌కు బదిలీ చేస్తూ మంత్రులుగా తాము ఒప్పందాలపై సంతకాలు చేశామని తెలిపారు. కల్లుగీత కార్మికులకు అండగా ఉంటామని, వారిలో ఉన్న ఆందోళనను తొలగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని పొన్నం ప్రభాకర్ చెప్పారు.

**'నందనం' ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలి**

**శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి**

కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన నందనం నీరా ప్రాసెసింగ్ యూనిట్ పనులన్నీ పూర్తయ్యాయి. దానిని త్వరలోనే ప్రారంభించాలి. ఎలక్షన్ కోడ్ వల్ల అప్పుడు ఓపెన్ చేయలేకపోయాం. దీనికి అనుబంధంగా ప్రతీ జిల్లాల్లో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేయాలి. గౌడన్నల విశేష ప్రయోజనాల కోసం ప్రభుత్వం పనిచేయాలి. తూతూమంత్రంగా ఒప్పందాలు చేస్తే కుదరదు. ఎన్నికల హామీలను అమలు చేయాలి.

# పొలంలోనే కౌలురైతు ఆత్మహత్య

- జాడలేని సాగునీళ్లు.. ఎండిపోయిన పంటలు..
- పెరిగిపోయిన అప్పులు.. దిక్కుతోచని పరిస్థితులు
- దుఃఖంతో విలపించిన అన్నదాత ఆత్మహత్య
- సిద్దిపేట జిల్లాలో ఉరివేసుకుని రైతు బలవన్మరణం

మల్లయ్య (ఫైల్)

దుబ్బాక, కమలాపూర్ మార్చి 12: తెలంగాణ వ్యాప్తంగా పదేండ్లు సుభిక్షంగా సాగిన సాగు నేడు సంక్షోభంలో చిక్కుకున్నది. ఊరూరా రైతన్నల గోడు వర్ణణాతీతంగా మారింది. యాసంగి పంటకు నీళ్లు లేకపోవడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. కండ్ల ముందే పంట ఎండిపోతుంటే చూసి తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నారు. ఆరుగాలం శ్రమించిన పంట పొలాలు నీళ్లు లేక నెర్రెలువారుతుంటే కన్నీళ్లు ఇంకిపోయేలా రోదిస్తున్నారు. చేతికి అందివచ్చిన పంటపై ఆశలు లేక దిక్కుతోచక తనువు చాలిస్తున్నారు.

**పంట ఎండి.. అప్పుల బాధతో**

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూర్‌లో అప్పులబాధతో కౌలురైతు పొలంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం మంతూర్‌కు చెందిన కౌలు రైతు ఈరమైన మల్లయ్య (50) తనకున్న అర ఎకరం పొలాన్ని నిరుడు అమ్మేశాడు. గ్రామానికి చెందిన మరొకరి పొలాన్ని మల్లయ్య కౌలుకు తీసుకుని యాసంగిలో వరి పంట సాగు చేస్తున్నాడు. పంట చేతికొచ్చే సమయంలో సాగునీరు లేక కండ్ల ముందే పంట ఎండిపోవడంతో మానసికంగా కలత చెందాడు. దీంతోపాటు 6నెలల క్రితం మల్లయ్య తన కూతురు వివాహం చేశాడు. వివాహం కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఓ పక్క పెరిగిన అప్పులు, మరోపక్క వరి పంట ఎండిపోవడంతో ఆందోళన చెందిన మల్లయ్య సోమవారం రాత్రి పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లయ్యకు భార్య మల్లవ్వ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

**కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి**

కుమారస్వామి(ఫైల్)

హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన కౌలు రైతు ముప్పు కుమారస్వామి (50) బుధవారం కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారస్వామి అదే గ్రామానికి చెందిన పల్లె కొమురయ్యకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఉదయం వ్యవసాయ పనుల కోసం బావి వద్దకు వెళ్లిన కుమారస్వామి తిరిగి ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ వద్ద చనిపోయి ఉన్నాడు.

# ఫ్యూచర్ సిటీకి ఆమోద ముద్ర

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- 7 మండలాలు, 36 గ్రామాలు ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి

రంగారెడ్డి, మార్చి 12(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే ఫ్యూచర్ సిటీకి బుధవారం ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రెటరీ సంబంధిత జీవో విడుదల చేశారు. రంగరెడ్డి జిల్లాలోని 7 మండలాలు, 36 రెవెన్యూ గ్రామాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకువచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాల్లోని పలు గ్రామాలను ఫ్యూచర్ సిటీ అథారిటీ ఆధీనంలోనే ఉండనున్నాయి. ఇక నుంచి ఈ గ్రామాల్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. త్వరలో ఫ్యూచర్ సిటీ అథారిటీకి ప్రత్యేకాధికారిని నియమించడంతో పాటు సిబ్బందిని కూడా కేటాయించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కందుకూర్ మండలంలోని గుమ్మడివెల్లి లేదా మీర్‌ఖాన్‌పేట్‌లలో అథారిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**ఫ్యూచర్ సిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలు...**

ఇబ్రహీంపట్నం మండలం- కప్పాడు, పోచారం, తులేకలాన్, తుర్కగూడ, ఎలిమినేడు కందుకూర్ మండలం-దాసర్లపల్లి, గూడురు, గుమ్మడివెల్లి, కందుకూరు, లేమూరు, కొత్తూరు, మాదాపురం, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల, పంజాగూడ, రాచులూర్, తిమ్మాపూర్, సార్లరావులపల్లి మహేశ్వరం- మహాబాత్ నగర్, తుమ్మలూరు మంచాల-ఆగపల్లి, నోముల యాచారం-చౌదర్‌పల్లి, గునగల్, మొగుల్లవంపు, తులేకుర్ధు, యాచారం.

# 277ఎకరాల అసైన్డ్ భూములకు ఎసరు!

- ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణ నోటిఫికేషన్ జారీ
- మార్కెట్ ధర చెల్లించాలంటున్న కొంగరఖుర్దు రైతులు

హైదరాబాద్, మార్చి 12(నమస్తే తెలంగాణ) : అధికారంలోకి వచ్చినప్పటినుంచి పేదల భూములపై పడిన కాంగ్రెస్ సర్కారు హైదరాబాద్ పరిసరాల్లో ఖరీదైన భూములు ఎక్కడున్నా వాటిని వదిలిపెట్టడంలేదు. భూములు ఇచ్చేదిలేదని రైతులు నెత్తీనోరూ బాదుకుంటున్నా ఇండస్ట్రియల్ పార్క్‌ల పేరుతో ప్రభుత్వం ఏకపక్షంగా నోటిఫికేషన్లు జారీ చేస్తూనే ఉన్నది. అభ్యంతరాలున్నవారు కలెక్టర్ కార్యాలయంలో చెప్పుకోవాలని హుకుం జారీ చేస్తున్నది. తాజాగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరఖుర్దు గ్రామ పరిధిలో 277.06ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. గ్రామం వద్ద ఇండస్ట్రియల్ పార్క్, లేక ఐటీ పార్కు ఏర్పాటుకు భూమి సేకరించాలని నిర్ణయించినట్టు కలెక్టర్ నోటిఫికేషన్ జారీచేశారు. 153మంది రైతుల నుంచి ఈ భూములు సేకరించనున్నారు. అన్నీ లావుని పట్టా భూములు కావడం విశేషం. ఈ భూముల అమ్మకం, కొనుగోలు, లీజుకి ఇవ్వడం వంటి లావాదేవీలు నిర్వహించరాదని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్నవారు 60రోజుల్లోగా కలెక్టర్, లేక అధీకృత అధికారి సమక్షంలో అభ్యంతరాలు నమోదు చేయవచ్చని సూచించారు.

**అరకొర నష్ట పరిహారం అందజేత**

పారిశ్రామికవాడల ఏర్పాటు కోసం ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని లగచర్ల, దిలావర్‌పూర్, తిమ్మాపూర్, నాగిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో భూసేకరణ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఇందులో అధికంగా అసైన్డ్ భూములు, కొన్నిచోట్ల సీలింగ్ భూములు ఉన్నాయి. భూములన్నీ దళితులు, గిరిజనుల సాగులో ఉన్న పంట భూములే కావడం విశేషం. అరకొర నష్ట పరిహారం అందిస్తూ భూములను బలవంతంగా సేకరిస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యతిరేకిస్తున్న రైతులను నిర్బంధించడం, పోలీసుల సహాయంతో భూములను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు దిగడంపై రైతులు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో భూముల ధరలు రూ. కోట్లల్లో ఉండటంతో రైతులనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం ఎకరాకు రూ. 20లక్షలకన్నా ఎక్కువ నష్ట పరిహారం ఇవ్వడంలేదని, ఆ డబ్బుతో తాము రాష్ట్రంలో మరెక్కడా భూములు కొనుక్కునే పరిస్థితి లేదని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం అంతగా ఇండస్ట్రియల్ పార్క్‌లు ఏర్పాటు చేయాలనుకుంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించి భూములు తీసుకోవాలని, లేకుంటే తమకు భూమికి బదులు భూమి ఇవ్వాలని వారు కోరుతున్నారు.

# ట్రిపుల్ ఆర్ రైతుల పోస్టుకార్డు ఉద్యమం

**అలైన్‌మెంట్ మార్చాలని కేంద్ర మంత్రికి ఉత్తరాలు**

చిన్నకొండూరులో పోస్టు ద్వారా ఉత్తరాలు పంపుతున్న బాధిత రైతులు

చౌటుప్పల్, మార్చి 12 : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని మందోళ్లగూడెం, తాళ్లసింగారం రైతులు బుధవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. న్యూఢిల్లీలోని కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ కార్యాలయానికి 200 ఉత్తరాలను పంపి నిరసనన తెలిపారు. ట్రిపుల్ ఆర్‌లో ఉత్తరభాగం అశాస్త్రీయ పద్ధతిలో చేపట్టారని, తక్షణమే ఇక్కడ రీ సర్వే చేయాలని, ఓఆర్ఆర్ నుంచి మిగతా దగ్గర 48 కిలోమీటర్లు తీసుకొని ఇక్కడ 28 కిలోమీటర్లకు పరిమితం చేయడం సరైందికాదని తెలిపారు. చౌటుప్పల్, వలిగొండ, రాయగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల్లోనే ఇలా చేయడంతో మున్సిపాలిటీలు 2-3విభాగాలుగా విడిపోతున్నాయని పేర్కొన్నారు. భూనిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని, లేకపోతే భూములకు బదులు భూములు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే నేషనల్ హైవేలు, విద్యుత్ లైన్లు, సాగునీటి కాల్వల కోసం భూములు కోల్పోయామని ఉత్తరాల్లో ఆవేదన వ్యక్తంచేశారు.



కడ్తాల్ మండల కేంద్రంలో హోలీ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి రంగులు పులుముతున్న మాజీ సర్పంచ్‌లు

# అర్ధరాత్రి మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

- పెండింగ్ బిల్లులు అడిగితే అక్రమంగా నిర్బంధిస్తారా?
- కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన కాదు, నిర్బంధపాలన
- సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ ఫైర్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లను పోలీసులు గృహనిర్బంధం చేశారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో ఆందోళనలు, నిరసనలు చేపడుతారనే అనుమానంతో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తాము అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వకపోయినా పోలీసులు అర్ధరాత్రి తమ ఇండ్లకు వచ్చి అదుపులోకి తీసుకున్నారని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం అల్లదేవిచెరువు గ్రామంలోని తన ఇంట్లో ఉండగా, పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారని మండిపడ్డారు. స్టేషన్ నుంచి వదిలిపెట్టిన తర్వాత యాదయ్యగౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలంటే మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన కాదని, నిర్బంధపాలన అని నిప్పులుచెరిగారు. మాజీ ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైనా సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్లయ్య, సుభాష్‌గౌడ్, గణేశ్, పద్మారెడ్డిలు పాల్గొన్నారు.

**పలుచోట్ల అరెస్టులు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పది గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లను, ఖమ్మం రూరల్ మండలంలోని ఓ సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా కూసుమంచిలో మాజీ వీఆర్ఏలను కూడా పోలీసులు అడ్డుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలుచోట్ల మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లింగంపేట, ఎడపల్లి మండలాల్లో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

# ఉద్యోగుల ఉద్యమబాట

మొదటిపేజీ తరువాయి...

సమగ్రంగా చర్చించారు. అనంతరం ఉద్యమ కార్యాచరణను ఖరారు చేశారు. మార్చి 31లోపు జిల్లా ఉద్యోగ జేఏసీ కమిటీ నిర్మాణం పూర్తిచేయాలని తీర్మానించారు. ఏప్రిల్ 1నుంచి 30 వరకు జిల్లా జేఏసీ సదస్సులను నిర్వహించి.. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. మే 4న రాష్ట్రస్థాయి ఉద్యోగుల సదస్సును నిర్వహించడంతోపాటు..మే 15న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే జూన్ 9న రాష్ట్రస్థాయిలో మహాధర్నాను నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జేఏసీ అదనపు సెక్రటరీ జనరల్ పుల్గం దామోదర్‌రెడ్డి, కో చైర్మన్లు మారెడ్డి అంజిరెడ్డి, ముజీబ్ హుస్సేనీ, ఏనుగుల సత్యనారాయణ, చావా రవి, సదానందంగౌడ్, ఉద్యోగ సంఘాల నేతలు రాధాకృష్ణ, ముత్యాల సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ సమావేశంలో జేఏసీ నేతలు

**ఓ మంత్రులారా..మీ శాఖల్లోని సమస్యలైనా తెలుసుకోండి : మారం జగదీశ్వర్**

రాష్ట్రంలోని ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రయోజనాల కోసం పెన్షనర్లు కోర్టులను ఆశ్రయించే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు సీఎం చెప్పినా పెడచెవిన పెడుతున్నాని తెలిపారు. 'ఓ మంత్రులారా.. కనీసం మీ శాఖల్లోని ఉద్యోగుల సమస్యలు తెలుసుకోకపోతే ఎలా?' అంటూ జగదీశ్వర్ ప్రశ్నించారు. కొందరు ఐఏఎస్ అధికారులు సీఎం చెప్పినా మేం కలిసేందుకు వెళితే సమయమివ్వడం లేదని అసహనం వ్యక్తంచేశారు. ఉద్యోగుల సమస్యలు వినేందుకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు పెట్టడం లేదని మండిపడ్డారు. జీవో 317 సమస్యలు పరిష్కరించలేదని, వీఆర్వోలకు మళ్లీ పరీక్ష పెడతామనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇప్పుడున్న అధికారులకు మళ్లీ పరీక్ష పెడితే రాస్తారా..? అని అధికారులను నిలదీశారు. ఒక డీఏ మాత్రమే ఇచ్చారని, ఆరు నెలకో డీఏ చొప్పున పెరగాల్సి ఉందని పేర్కొన్నారు. తక్షణమే రెండు డీఏలను చెల్లించడంతోపాటు మిగతా డీఏలను పీఆర్సీలో కలపాలని డిమాండ్‌చేశారు.

**ఇంతకు మీరెవరని అవమానిస్తున్నారు : శ్రీనివాసరావు**

సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతోఆశతో తాము మంత్రుల వద్దకెళితే.. ఇంతకు మీరెవరని ఉద్యోగ సంఘాలను దారుణంగా అవమానిస్తున్నారని ఎంప్లాయిస్ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. ఒకరిద్దరు మంత్రులను తాము ఇప్పటికే 20-30సార్లు కలిస్తే ఇంతకు మీరు ఎవరు..? ఉద్యోగ సంఘాల నేతలా ? అంటూ తమను అవమానించినట్టు ఆయన గుర్తుచేశారు. జీఏడీ సర్వీసెస్‌లోని అధికారులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అంటూ కాలయాపన చేస్తున్నారని, సచివాలయంలో ఇద్దరు ముగ్గురు ఐఏఎస్ అధికారులు ఉద్యోగ సంఘాల నాయకులను కనీసం కూర్చోబెట్టి మాట్లాడటం లేదని వాపోయారు. రాష్ట్రంలో ఉద్యోగ సంక్షేమం అధమస్థితికి దిగజారిపోయిందని విమర్శించారు. అధికారగణం ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదని ఆరోపించారు.

ఆందోళన చేస్తున్న టీచర్లు

**సమగ్ర కుటుంబ సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి**

**మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట టీచర్ల ఆందోళన**

వరంగల్, మార్చి 12 : గత నవంబర్‌లో సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమనేటర్లు, సూపర్‌వైజర్లకు వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్‌చేస్తూ బుధవారం వరంగల్ మున్సిపల్ కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం ఎదుట సమగ్ర కుటంబ సర్వేలో విధులు నిర్వర్తించిన టీచర్లు ప్లకార్డులతో ధర్నా చేశారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో సర్వే చేసిన ఉద్యోగులకు ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించలేదని మండిపడ్డారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జీటీఏ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన చేసిన ఉద్యోగులకు ఇతర జిల్లాలో రెమ్యునరేషన్ చెల్లించినప్పటికి వరంగల్ జిల్లాలో చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెమ్యునరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

**కరెంటు సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

తాంసి, మార్చి 12: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్ శివారులో బుధవారం పంటలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ రాజర్షి షాకు రైతులు కరెంటు సమస్యపై ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారులు ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. రైతు దర్శనాల రవికిరణ్ భూగర్భ జలాలు ఎండిపోవడంతో 4 ఎకరాల్లో వేసిన జొన్న రెండు ఎకరాలు ఎండిపోయాయని, మిగిలిన రెండెకరాలు కరెంట్ సక్రమంగా వస్తే రక్షించుకోవచ్చని తన బాధను వివరించాడు. స్పందించిన కలెక్టర్ వెంటనే కరెంట్ సరఫరాలలో లోపం లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు.

హస్నాపూర్ శివారులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

# ఆమ్దానీ లేదు.. సర్కారు నడపలేను!

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ.. 'ఒకటో తేదీన జీతాలివ్వకపోతే ఏ యజమాని మీద, ఏ ప్రభుత్వం మీద ఎందుకు విశ్వసముంటది? ఎందుకు నమ్మకంగా పనిచేస్తరు? ఔను. కొన్ని సమస్యలున్నాయి. చర్చల అనంతరం, ఆయా సమస్యలు పరిష్కారం కాలేదని ఉద్యోగులెవరైనా ప్రభుత్వానికి సహకరించబోమని అనుకుంటే మన పరిస్థితి ఇంకా దిగజారిపోయి, నెలనెల జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుంది' అని హెచ్చరించారు. 'ఈ నెల జీతాలివ్వలేని పరిస్థితి ఉంటే రిజర్వ్‌బ్యాంక్‌లో తలతాకట్టుపెట్టి 4వేల కోట్లు తెచ్చి జీతభత్యాలిచ్చాం. మీరేమో డీఏలు, కరువుభత్యాలు అడుగుతున్నరు' అని వ్యాఖ్యానించారు. ఆదాయం సరిపోక, జీతాలు, బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నామని, ఓనెల ఆశ వర్కర్ల జీతాలు, మరో నెల అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు, షాదీముబారక్, కల్యాణలక్ష్మిలు పెండింగ్‌లో పెట్టి రొటేషన్ చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నామని చెప్పారు.

**పథకాలకు మరో 22 వేల కోట్లు కావాలె**

ఆరు గ్యారెంటీలు, 130 సంక్షేమ పథకాలు అమలుచేయాలంటే ఇప్పుడున్న నెలసరి ఆదాయానికి అదనంగా మరో రూ.22 వేల కోట్లు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఇప్పుడు నెలకు మిగిలే రూ.5వేల కోట్లతో సర్కారును నడపలేకతున్నామని చెప్పారు. 'ఆర్థిక పరిస్థితిపై నేను ఎన్నాళ్లు అబద్ధాలు చెప్పాలె. అందుకే వాస్తవాలు చెప్తున్న' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతినెలా రూ.22 వేల కోట్లు అవసరం కాగా, వివిధ మార్గాల ద్వారా రూ.18 వేల కోట్ల నుంచి రూ.18,500 కోట్ల ఆదాయమే సమకూరుతున్నది. దీంట్లో ఉద్యోగుల జీతభత్యాలకు, పెన్షనర్లకు, అన్నీకలిపి రూ.13 వేల కోట్లు పోతే, మిగిలేది రూ.5 వేల కోట్లే. ఎస్ఎల్‌బీసీ కూలిపోయింది. కాళేశ్వరం ఆగిపోయింది. రీజినల్ రింగ్ రోడ్డు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇవన్నీ ఇందులో నుంచే తీసి కట్టాలి. రూ.42 వేల కోట్ల బకాయిలున్నాయి. రూ.8 వేల కోట్లు కాంట్రాక్టర్ల బిల్లులు కట్టాలి. ఇవేకాకుండా వివిధ పథకాలకు రూ.22 వేల కోట్లు కావాల్సి ఉన్నది. పరిస్థితిని అంతా అర్థం చేసుకోవాలి' అని కోరారు.

# 'తెలంగాణ' పేరు మారిస్తే పోరాటమే!

- తెలంగాణ విశ్వవిద్యాలయం పేరు మార్పుపై విద్యార్థి సంఘాల హెచ్చరిక
- ఈశ్వరీబాయి వర్సిటీగా నామకరణకు సర్కారు యత్నం
- మండిపడుతున్న మేధావులు, ఉద్యమకారులు



టీయూ పేరు మార్చవద్దని వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

డిచ్‌పల్లి, మార్చి 12: నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తుండడంపై విద్యార్థి, ఉద్యమ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఎన్న